# "లోకంచేసిన మేలు"

రచయిత :
... చెన్నూరి వెంకటస్వామి ...

లోకం గ్రుడ్డిదని వొప్పుకోక తప్పదు. ఆడదాన్ని కన్నెత్తిచూస్తే చాలు. వాడికీ దానికీ యేదో లేనిసంబంధాన్ని ముడిపెడుతుంది, తద్వారా కలిగే అనర్థాలకు తలల్లొగ్గి ఆక్రోశించే అనాథలను చూసి, పట్టలేని సంతోషంతో కేరింతలు కొడుతుంది. అప్పుడే తనకు తృప్తి.

కాని, మా విషయంలో మాత్రం అలా చెయ్యలేకపోయింది. మేలే చేసింది. కాదు, మేలే జరిగిందంటే బాగుంటుందేమో! అదెలాగో చెబుతా వినండి:

నేనావూరికి బదిలీఅయిన యీ రెండేళ్ళనించీ రంగనాయకమ్మగారింట్లోనే భోంచేస్తూ, వాళ్ళ డాబామీద నేవున్నగదిలో అద్దెకుంటున్నా. నిజానికి రంగనాయకమ్మ చాలా మంచిమనిషి. భోజనవిషయంలోగాని, స్నానపానాదుల విషయంలోగాని, యేమాత్రం లోపం జరక్కుండా చూసుకోవడంచేతా, నేనూ యింటిమనిషికిమల్లే మసులుకుపోతోండడంచేతా, మమ్ముచూచి యీర్ష్యపడ్డవాళ్ళుకూడా లేకపోలేదా వూళ్ళో. వాళ్ళల్లో ఎదురింటి రామారావుగారబ్బాయి, రామగోపాలాన్ని అగ్రగణ్యుడనే చెప్పాలి.

ఎప్పుడైనా వీధిలో అవుపిస్తే, యేదో పనివుండేవాడికిమల్లే పిలిచి, "యేమోయ్! రావ్ కులాసాగా వున్నావా? పాపం, యెక్కడ తీరికలేనట్టుంది. ఈమధ్య కనబడ్డమే కరువైపోయింది! ఇంతకూ రంగనాయకమ్మగారి చేతిభోజనం వంటబట్టినట్టే వుంది! రంగుతేలేవే? అదృష్టమంటే నీదేనోయ్! అయితే రంగనాయకమ్మ స్వయంగా వడ్డిస్తుందా లేక ఆవిడకూతురు ప్రభావతేమైనా......" అని యేదో ఛలోక్తిగా మాట్లాడేవాడు రామగోపాలం. ఆ మాటల్లో హేళన, ఈర్ష్య యీ రెండూ మిళితమైయుండేది. రామగోపాలమే, కాదు, కుర్రకారంతా యిదే ధోరణిలో మాట్లాడేవారు! అమ్మలక్కలు నన్నుచూడ్డం తటస్థిస్తే యేదో గుసగుసలాడుకునేవారు. నన్నుచూసి ఆడవాళ్ళలా అసహ్యించుకోడానికీ, మగాళ్ళలా యీర్ష్యపడ్డానికీ కారణం కనుక్కోవడానికి అట్టే కాలం పట్టలేదు.

ఒహనాడు తోటకెళ్ళివస్తోంటే రామగోపాలం కలుసుకుని "ఏమోయ్! మహాజోరుగా పోతున్నావ్, అంత తొందరెందుకు? నన్నూ రానీవోయ్! ఆఁ...వాళ్ళను పిల్లెత్తుకపోదు లేవోయ్ యింతలోకే" అని, అదోలాచూచి, కిసుక్కున నవ్వాడు. ఇంతకూ వాడి వాలకం అర్థంగాని నాకు గుండెల్లో గితుక్కుమన్నది. అసలు వాడెందుకలా మాట్లాడుతుంటాడో అడిగి తెలుసుకోవాలని చాలరోజులుగా మనసులో వుండేది. వీలు చిక్కిందికాదు. ఇదే అదననీ, దగ్గరకు రానిచ్చి "అయితే నీవనడం యేంటోయ్?" అని నిలేసి అడిగాను. "ఆఁ...మరేంలేదు. అంత తొందరగా వెళుతోంటె అన్నాను" అని దేబెమొహం వేశాడు. "అదిగాదోయ్! ఆ పిల్లెత్తుకపోవడం ఎవర్నని?" నవ్వుతూనే అడిగాను. "ఆఁ...అదా?... నీకు తెలీదటోయ్? నే చెప్పాలా? ఐతే చెబుతా విను. ఆ నవమోహన యవ్వనాంగిని ఆ ప్రభావతిని" తెచ్చుకున్న ధైర్యంతో అనేసి అదోలా చూచాడు నా కళ్ళల్లోకి.

"అంటే ప్రభావతికి నేను కాపలా కాస్తున్నాననేనా నీ ఉద్దేశం?"

"ఆఁ...అదేంటోయ్? అలాగంటావ్? నువ్వేనేంటి అవకాశముంటే యే మగాడైనా సరే ఆ దివ్యసుందరమూర్తి పాదాలవద్ద కుక్కలా కాచుకు పడివుండడూ?!....... (ఓ నిట్టూర్పువిడిచి) ఇంతకూ ఆ యదృష్టం నీవొక్కడికే దక్కిందోయ్! అదృష్టమంటే నీదే!" ఇంకా యేదేదో వాగుతున్నాడు.

"నువ్వు నన్ను అపార్థం చేసుకొంటున్నావోయ్! గోపాలం!"

"అపార్థంకాదోయ్! నిజంగానే! అందరికీ తెలిసిందేగా! ఈరోజు నువ్వుకాదంటే నమ్మిపోతారా? ఇంతకూ అలాంటి అప్సరస, అపురూపసుందరి అందుబాట్లోవుండగా జారవిడుచుకునే వెర్రివాడుంటాడా? ఎంతటి జితేంద్రియుడైనా మచ్చుమందు తిన్న నల్లకుక్కలా వెంటబడాలిసిందే! అందులో నీ తప్పేముంది? తప్పంతా ఆ బ్రహ్మదేవుడిది. ఆవిడ కెందుకంత అందాన్నివ్వాలి? పైగా కట్టుకున్నవాడికి యింత చిన్నవయసులోనే దూరం చెయ్యాలి?"

"ఛీ! ఛీ! పాడుమాటలు ఆ యమ్మాయి అలాంటిది కాదోయ్!"

"నేనన్నానా? ఆయమ్మాయి అలాంటిదని? కాని పాపం! అంత చిన్ని వయసులోనే భర్తను-పోగొట్టుకుని, తీరని వాంఛలతో ఎలా క్రుంగిపోతుంది చెప్పు? ఆయవ్వనమంతా అడవిగాచిన వెన్నెల్లా, అడవిపూచిన పువ్వుల్లా వృథాగావలసిందేనా?" ఇంతలో ఎవరో సమీపిస్తూన్నందున మా సంభాషణ ఆగిపోయింది.

నాకు తెలుసు లోకం మాకులేని సంబంధాన్ని అంటకడుతోందని. తెలిసి యేం చెయ్యను? నేను లేదంటే లోకం నమ్ముతుందా?

ప్రభావతి రంగనాయకమ్మగారి కుమార్తె. ప్రభావతి ఐదోయేటనే తండ్రి పోయాడు. రంగనాయకమ్మ ఎంతో గారాబంగా పెంచి, పెద్దదాన్నిచేసి, తన అన్నదమ్ముడికే ముడిపెట్టి ఇద్దర్నీ ఇంట్లోనే వుంచుకొన్నది. ఉన్న ఒక్కడాబా, ఇరవై యెకరాల మాగాణీ అంతా అమ్మాయిపేరిటే వ్రాయించి పెట్టి, తమ్ముడూ కూతురూ చిలకా గోరింకల్లా సంసారం చేసుకొంటూంటే తన పాపిష్ఠికళ్ళతో చూసి ఆనందిస్తూ, అమ్మాయి కడుపులో మూడుపువ్వులూ, నాలుక్కాయలూ కలిగేదాకా తన జీవితశేషాన్ని 'రామా-కృష్ణా'

అనుకొంటూ గడిపేయాలనుకొన్నది. కాని కార్యం అయిన నాల్గోమాసమే తమ్ముడు మంచమెక్కుతాడనీ, కూతురు ముండమోస్తుందనీ యెన్నడూ అనుకోలేదు. విధిని ఎవరు తప్పిస్తారు? కావలసింది కాకమానదు. అంచేత సంసారభారమంతా మళ్ళీ రంగనాయకమ్మే మోయాలిసొచ్చింది పెద్దముండైకూడా. ఇంతకూ కాస్తకలిగిన సంసారం కాబట్టి యే గొడవా లేకండా సాఫీగా గడిచిపోతోంది. వూళ్ళో కాపులుకూడా రంగనాయకమ్మగారి చనిపోయిన భర్తగారి మంచితనాన్ని, హోదానీ మరువలేక అన్నివిధాలా ఆ సంసారానికి తోడ్పడుతూనే వున్నారు. రంగనాయకమ్మగారి తమ్ముడు చెల్లుతున్న సంవత్సరానికే నా కావూరు బదిలీ అయింది. రంగనాయకమ్మ భర్తగారికీ, మా నాన్నగారికీ ఒహప్పుడు గాఢమైత్రే నేనావిడగారింట్లోకి కాలుబెట్టడానికి కారణం. నిజానికి రంగనాయకమ్మ మర్యాదలెరిగిన పెద్దమనిషి. కూతురు ప్రభావతికూడా తల్లికేమాత్రం తీసిపోదు. మట్టూ మర్యాదలతో మసిలేది. తనేదో, తనపనేదో. ఒహరిజోలికి పోయేదికాదు. మగాళ్లని కన్నెత్తయినా చూచేదికాదు. ఎవరితోనూ అంత చనువుతో ప్రవర్తించేదికాదు. ఎప్పుడైనా నా కావిడతోగాని, ఆవిడకు నాతోగాని పనిబడితే సంభాషణ చాల జాగ్రత్తగా ముక్తసరిగా నడిచేది. ఆ మాటల్లో అనవసరంగా దొర్లిన చమత్కారంగానీ, కొంటెతనంగానీ వుండేదికాదు.

అసలా అమ్మాయిమీద నాకెలాంటి అభిప్రాయమూ వుండేదికాదు. నేనెప్పుడూ ఆవిడ అందాన్ని వర్ణించిచూళ్లేదు. చూడాలని యెప్పుడూ అనుకోలేదు. ప్రవర్తన్నుబట్టి ప్రభావతిగూడా అంతేనేమో;

ఐతే, లోకం యెందుకిలా అనుమానపడాలి?

వయసులోవున్న ఓ కుర్రాడూ, ఓ కుర్రదీ ఒక్కచోటే మసలుతూ, ఒకర్నొకరు ఒంటరిగా దర్శించుకొంటూ ఎలా వూరుకోగలరు? అనేనా లోకం అనేది? అందులో ఆవిడ వో పతివిహీన-నేనో అవివాహితుణ్ణి-అంచేత తప్పకండా......ఛీ—ఛీ — లోకం ఎంత గ్రుడ్డిది!

ఆ రామగోపాలంగాడు ఏమేంవాగాడు! ఆవిడ ఓ అందాలకుప్పట! అపురూపసుందరిట! అప్సరసట! పైగా నేను అదృష్టవంతుణ్ణిట!

ఐతే, ఆవిడ అంత అందంగా వుంటుందా? పాపం! ఈ చిరుతప్రాయంలోనే ఆ


## నిట్టూర్పు

ప్రణయమే ప్రమాదానికి దారితీస్తుంది. విరాగిని చేస్తుంది. త్యాగానికి ఉసిగొల్పుతుంది. ఈ నవలయందు స్త్రీ వలచినను పురుషుడు మిత్రునికై స్వార్థాన్ని గణించక త్యాగంచేయటం అపూర్వ విషయం. తాననుకొన్నట్టు, తన్ను ప్రేమించినయువతి తన ఇష్టానుసారం మిత్రుని వివాహమాడి సౌఖ్యాన్ననుభవించక పోవటంచూచి చింతకు లోనై తను మరుగైపోవుట విషాదపరిణామం. ఇది పాశ్చాత్య నవలా పద్ధతి ననుసరించి రచింపబడినది. తెలుగులో ఇట్టి నవలారచన కిదే ప్రథమం. చదువుటలో మైమరపును గల్గించును.

వెల 0—8—0 అణాలు.

చిత్రగుప్త ఆఫీసు,
6, లాయర్ చిన్నతంబి
మొదలివీధి, మద్రాసు.


నోము నోచుకొంది. నిజమే. వాడన్నది తీరని వాంఛలతో ఎలా కృంగిపోతోందో! పాపం ఆ నిండు యవ్వనమంతా అడవిగాసిన వెన్నెల్లాగా వృథాకావలసిందే? ప్రకృతిసిద్ధమైన కోర్కెల్ని బలవంతంగా ఎలా అణుచుకో గలుగుతుంది? నిజంగా ఆ సుకుమారి హృదయకుహరంలో యేదో ఒకరూపాన్ని చిత్రించుకుని అజ్ఞాతంగా ఆ దివ్యసుందరమూర్తిని ఆరాధిస్తూవుండాలి. తప్పదు. అయితే అది మానసిక వ్యభిచారం కదూ? అవును. ఐనా ఫరవాలేదు. మనసా వందమందితో వ్యభిచరించవచ్చు. కాని, వితంతువు వివాహంచేసుకుని హాయిగా జీవించకూడదు. అలా చేస్తే అది సంఘందృష్టిలో ఓ క్షుద్రజీవి; ఇలాంటి ఆలోచన్లు నా బుర్రలో రైలుబండిలా రొద పెడుతూ పరుగెడుతోన్నై. ఎప్పుడు కునుకు పట్టిందో తెలీదు.

కిటికీలోంచి మీదపడ్డ సూర్యకిరణాలు వేడిగా స్పృశించి, తట్టిలేపేవరకూ మెలకువ రాలేదు. కాలకృత్యాలు తీర్చుకుందామని రూము వెలుపలికి వొచ్చేసరికి ఎదురుగా, పశువులపాకలో ఆవుపాలు పితుకుతోన్న ప్రభావతి కనబడింది. ఆమె నన్ను చూళ్ళేదు. ఆరోజు నాకెందుకో ఆవిణ్ణి చూడగానే వొళ్ళు జలదరించింది. మోకాళ్లతో చెంబును పట్టుకుని రెండుచేతులతోనూ ఆవుపొదుగును పితుకుతోంది. జారిన పయ్యెద ఆ వున్నత వక్షోజాలమధ్య యిరుక్కుని, ఆ వూపులో నర్తించే ఆ పాలిళ్ళ నృత్యభంగిమను చూస్తూ వుండిపోయింది. బలిష్ఠంగా పెరిగి, కండలు తిరిగిన అవయవాలు, పచ్చటి శరీరం, నునుపాటి చెక్కిళ్ళు, మెత్తనికళ్ళు నన్నట్టే ఆకర్షించాయి. ప్రభావతి యిన్నాళ్ళూ చూస్తోన్న ప్రభావతేకాని, ఆనాడు ఆవిడ ప్రతి అంగంలోనూ ఓ ప్రత్యేకత కనిపిస్తోంది. ఆ కళ్ళల్లో యేదో చిలిపితనం, ఆ పెదవుల్లో యేదో అమాయకత్వం అర్థమౌతోంది. ఎంత సేపయినా చూస్తూ వుండిపోవాలనిపించింది. శిలాప్రతిమలా చూస్తూ వుండిపోయాను పది నిముషాలపాటు. మళ్ళీ యెవరైనా చూస్తారేమోననే భయం. పోనీ ఆవిడేనా యీ దొంగతనాన్ని కనిపెడితే యింకేముంది?

శరీరంలోని ఆ నునుపూ, ఆ మెరుపూ అవయవాల వొంపుల్లోని ఆ సొంపూ, కదులాడే కాటుకకళ్ళల్లోని ఆ కాంతీ, లేపెదవులమీద మెరపులా మెరిసి మాయమయ్యే ఆ చిరునవ్వు యీ రెండేళ్ళపాటూ చూస్తూ కూడా చూడలేకపోయానే!

కాని, మరుక్షణంనించీ ఆవిణ్ణలా పరీక్షగా చూడలేకపోయ్యాను. యేదో తప్పుచేసిన వాడికి మల్లే గుండెలు బాదుకొంటున్నాయి. ఇదివరకున్న ఆ కొద్దిపాటి చనువుతో

నయినా ప్రవర్తించలేకపోయాను. ఎదురుగుండా నిలిచి, కన్నెత్తిచూసే సాహసమే లేకపోయింది. ఏదో భయం, బిడియం పీక్కుతినేది. దొంగతనంగా, గంటలతరబడి అదేపనిగామాత్రం చూస్తూ వుండిపోయేవాణ్ణి. ప్రభావతి నాలో యీ మార్పును గుర్తించే కాబోలు పూర్వంలా మసిలేదికాదు. ఎప్పుడయినా కంటబడితే లేడిలా తృటిలో తప్పుకునేది. ముందులా కన్నెత్తిచూడ్డానికయినా బిడియపడేది. అనవసరంగా సిగ్గుపడేది. ఇన్నాళ్ళూలేనిసిగ్గు-బిడియం ఈనాడుమాత్రం ఎక్కణ్ణించి వొచ్చింది? యేమో యెవరూ చెప్పలేరు. నాలాగే గంటలతరబడి దొంగతనంగా చూసేది ఆశగా ప్రింగేట్టు. నే నా విషయాన్ని గుర్తుపట్టినప్పుడు సిగ్గుతో కృంగిపోయేది.

మే మెందుకిలా మారిపోయాం? మా హృదయా లెప్పుడూ ఒకరి నొకరు చాటుగా ఆశగా చూచుకొంటూ వుండిపోవాలని కోరేది, కారణం?

రోజులు దొర్లేకొద్ది మా హృదయాలు యేదో సన్నిహిత సంబంధాన్ని పెంచుకొంటోన్నయ్.

ఆరోజు రంగనాయకమ్మ వూళ్ళో లేదు. పక్కపల్లెకు పనిగా వెళ్ళింది. ప్రభావతి ఒక్కటే యింట్లో వుంది. ఆరోజు ఆఫీసుకి సెలవు కావడం మూలాన నేనూ గదిలోనే యేదో గేయరచనలో మునిగివున్నాను.

నిండుచందురుడిచ్చు - పండువెన్నెలలోన
కలువరేకులవంటి - కన్నులూ గలదాని
కన్నానహో! - కన్నానహో!

కలం నడవలేదు. డాబా కెదురుగావున్న మల్లెపందెరమీద తలలెత్తుకొని, నింగిని తొంగి చూస్తూన్న బాలపత్రాలమీది హిమబిందువులు సూర్యరశ్మికి కెంపుల్లా - పచ్చల్లా - పుష్పరాగాల్లా వివిధరంగుల్లో మెరిసిపోతోన్నయ్. వీచే చిరుగాలులు తీగలను వూపి హిమకణాలను క్రిందికి పడద్రోసి, పరిహాసికాలాడుతోన్నయ్. విరియని మొగ్గలు తలలు పైకెత్తి ఎవరికోసమో నిరీక్షిస్తూ కూచున్నాయ్. పరిపక్వంగాని కన్నెను ప్రేమించిన రసికుడుపడే పరితాపాన్ని అనుభవిస్తూన్న తుమ్మెదలు, ఆ మొగ్గలచుట్టూ తిరిగి తిరిగి పడిగాపులు పడుతోన్నయ్. యీ సృష్టి చిత్రాల్ని తిలకిస్తూ, మనసులో ఉబికిన భావ తరంగాలను భాషలోకి తర్జుమాచేయడానికి సతమతపడుతూ తరువాతి చరణాన్నిలా అల్లుతున్నా:

నీలిమబ్బులనడుమ - తళుకాడు మెరపులా
తారకావళి నడుమ - తారాడు చంద్రులా
కన్నానహో! - కన్నానహో!

ఇంతలో యెవరో నా వెనకాలే నిల్చుని నా గేయాన్ని కంఠస్తంచేసే ప్రయత్నంలో వున్నట్లు అలికిడి విని వెనక్కి తిరిగిచూచాను. ప్రభావతి! ఎప్పుడొచ్చిందో యేమో! నాకు చాల దగ్గరగా నిల్చొని నా రచన్ను దొంగలిస్తోంది. నన్ను చూచి వెనక్కు ఓ అడుగు వేసి



బుగ్గలు సొట్టలుపడేలా ఓ చిన్ని నవ్వు నవ్వి "పదిన్నరయింది స్నానం చేద్దురులెండి!—నీళ్ళుతోడాను" అని, సిగ్గుతో తల వొంచుకొన్నది. మారాడకండా లేచాను. స్నానం పూర్తయింది. భోజనాలగదిలో కెళ్ళాను. పీటవేసి, విస్తరిపరచి, నాకోసం ఎదురు చూస్తోంది ప్రభావతి. పీటమీదకూర్చున్నాను. విస్తట్లో అన్ని వడ్డిస్తోంది. ఆ యందమైన చేతులు, సుకుమారమైన వేళ్ళూ చూస్తూ వుండలేకపోయాను. కళ్ళు కొంచెం పైకి ప్రాకాయి. తొలగిన పయ్యెదలోంచి, తెల్లని వుల్లిపొరజాకెట్టులో బంధించబడ్డ ఎత్తయిన పాలిళ్ళు తొంగి తొంగి చూస్తోన్నయ్. శరీరమంతా యేదో ప్రాకినట్టయింది. చూస్తూ వుండిపోయాను. ప్రభావతి నన్ను గమనించింది కాబోలు, సిగ్గుతో నవ్వి, పమిట సరిచేసుకు నేవటికూ నే నీ లోకంలోలేను. భోజనము పూర్తయింతరువాత నాగదిలోకి వెళ్ళిపోయాను. యేవేవో ఆలోచనతో తల వూగిపోతోంది. అలాగే ఆలోచిస్తూ నిద్రపోయాను. నిద్రలేచేవరకు యేదో కోకిల స్వరం తియ్యగా వినబడుతోంది మంచి ట్యూన్లో:—

నిండుచందురుడిచ్చు - పండువెన్నెలలోన
కలువరేకులవంటి - కన్నులూ గలదాని
కన్నానహో! - కన్నానహో!
నీలిమబ్బులనడుమ - తళుకాడు మెఱపులా
తారకావళినడుమ - తారాడు చంద్రులా
కన్నానహో! - కన్నానహో!

అని, వినబడుతోంది నాగేయం. గొంతు ఎవరిదో కాదు ప్రభావతిదే. ఆపాటనే పదే

పదే పాడుతోంది. యెన్నిమార్లయినా వినా లనిపించింది. పాట ఆగింది. కాయితం కల్లం మీద పరుగెత్తింది.

విరహావిహ్వల హృదయ విభ్రాంతితోలగంగ
వీనుల కింపయిన - మధుర మంజులగీతి

విన్నానహా! - విన్నానహా!

అదే ట్యూన్లో, ఆ చరణాన్ని గొంతెత్తి పాడాను. ప్రభావతి నా గొంతువినేకాబోలు గది వెలుపలికి వొచ్చి నావేపు చూస్తూ వింటోంది. నాదృష్టి ఆ వేపే మరలడం మూలాన మెరపులా మెరిసి మాయమైంది. తరువాతి చరణం తనంతదే నానోటపలికింది.

ఘల్లు ఘల్లున కాలి - మువ్వలుమ్రోగంగ
చెంగు చెంగుల దుముకు-లేడి బోటిని నేను

కన్నానహా! కన్నానహా!

ఆరాత్రి భోజనానంతరం గదిలో లాంతరు గుడ్డివెలుతుర్లో నా గేయాన్ని మళ్ళీ ఒహ సారి గొంతు సారించి, చిన్నగా పాడుతున్నాను. మూడు చరణాలూ పూర్తయింది. అంతవరకూ నా వెనకనే నుంచుని నాపాట వింటోన్న ప్రభావతి "తరువాతి చరణం కూడా పూర్తిచేయండి!" అని 'కిల కిలా నవ్వింది.

ఆవిడ్డవేపు చూచాను తలవొంచి నేలకేసి చూస్తూ, తప్పుచేసిన బడిపిల్లలా మౌనంగా నుంచొని వుంది. యెందుకో ఆ నవ మోహనాంగిని అలా చూస్తూ వూరకుండలేక పోయాను. "రా!—కూచో—ప్రభా!" అని అంటూ రెండుచేతులూ పుచ్చుకుని నా మంచంమీద కూచోబెట్టాను. "యేం ప్రభా! యెందుకొచ్చావ్?" అని అడిగాను. జవాబు లేదు. సిగ్గుతో కృంగిపోతోన్నట్టు గ్రహించాను. 'ఛీ!—యెందుకడిగానా' అని నన్ను నేనే తిట్టుకొన్నాను. చిన్నగా రెండుచేతులూ పుచ్చుకుని మీదకు లాక్కుని, నాబాహువులతో బంధించాను. కిక్కురుమనకుండా, యేదో ఆనందానుభూతిని అనుభవిస్తూ, కళ్ళు మూసుకున్నది. అలా యెంతసేపు గడిచిపోయిందో!

గోడమీది గడియారం టంగ్—టంగ్ మని పన్నెండు కొట్టింది. ప్రభావతి నా మెడను తన కోమలహస్తాలతో పెనవేసి, కళ్ళల్లోకి చూస్తూ, కొంటెగా నవ్వుతూ— "మరి నాలుగో చరణం పూర్తిచేయరూ?" అని ప్రశ్నించింది. నేను తడుముకోకండా "ఆహా! యిదిగో పూర్తిచేస్తా! విను!" అని బుగ్గల్ని రెండు చేతులతో సాగదీసి వొదలి పాడాను:

కాముకేళీ నన్ను - కలసి కౌగిటనుండ
కలతదీరనికనులు - కదులాడుచుండంగ

కన్నానహా! కన్నానహా!

ప్రభావతి కిలకిలా నవ్వుతూ నా పెదాలను తన పెదాలతో స్పృశించింది.

"అయితే, ప్రభా యీ రెండేళ్ళపాటూ నే చూడలేని యీ సౌందర్యం—యీముగ్ధత్వం—నేడుమాత్రం నే నెలా చూడగలుగుతున్నాను?" అని అడిగాను.

కొంటెగా నవ్వి, "ఐతే, యిన్నాళ్ళూ మీలో చూడలేని యీఅందం యీ ఆకర్షణ యీకొంటెతనం నేడుమాత్రం నేనెలా చూడగలుగుతున్నానో ముందు సెలవిస్తారా?" అని అడిగింది.

ఏమని జవాబు చెప్పను?

నిద్రపోతోన్న మా యంతః చక్షువుల్ని తట్టిలేపి, మా యీ మధురానుభూతికి హేతుభూతమైన లోకం మాకు మేలే చేసిందని తెలుసుకోవడానికి యిట్టే కాలంపట్టలేదు.

రేపు మా యీ ఆనందమయ జీవితాన్ని చూచి, ఓర్చుకోలేక వ్రేలెట్టి చూపుతుందని మాకు తెలుసు కాని మేం లెక్కచేయం.

# తొలిజాము

రచన: మహబుబ్

*

మధుమాస కుసుమాల
మాధుర్యమున తేలు
పదును బాణము వేసె
మదనుడే కాబోలు
నిదుర మేల్కాంచితి
ఎదురుగానున్నట్టి
హృదయరాణీపటము
మధురవాణీబొమ్మ
అధరామృతంబివ్వ
హృదయేశరమ్మనీ
సేదతో బిలిచెనో !!
కదలె నాకళ్ళలో
కథలల్లు కలముతో
కథనాడు వ్రాసితి
కథయిదే కాబోలు
వధువుగానను జేరి
మృదువుగా నను బిల్చి
నిదురింతు ప్రియతమా
హృదయాన నను జేర్చి
ఆదరింపుముయంచు
సదయహృదయముతోడ
చెదరిపోయినజటతో
బెదరినా కళ్ళతో
ఎదలోన శిరముంచె
వదనారవిందాన
అధరమే కదలంగ
పెదవిలో చిరునవ్వు
పెదవితో జుట్టుచు
నిదురపోయినరేయి
ఎదురుగానున్నట్టి
యదుకిశోరుడె సాక్షి
రాదాయె నిదురైతె
బాధాయె హృదయాన
కదిలెనే కన్నీళ్ళు.

